క్లుప్తంగా

భూమిపూజ



భూమిపూజ చేస్తున్న నాయకులు

లోకేశ్వరం: మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద కుమురం భీం విగ్రహం ఏర్పాటుకు ఎంపీటీసీ సభ్యుడు జయసాగర్‌రావు, వీడీసీ సభ్యులు భూమిపూజ చేశారు. వీడీసీ నాయక్‌పోడ్ సంఘాల ఆధ్వర్యంలో విగ్రహం ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు కుమ్మరి విఠల్, అంకంటి శ్రీనివాస్, మోడం శంకర్, ఆదివాసీ నాయక్‌పోడ్ సంఘం అధ్యక్షుడు మురళీ, నాయకులు బండారి సాయన్న, ప్రశాంత్, జగదీప్, నరేశ్, పోతన్న, దత్తు, భోజన్న, హన్మంతు, శంకర్ ఉన్నారు.

విద్యార్థికి సీవీరామన్ అవార్డు



పురస్కారం అందుకుంటున్న హర్షవర్ధన్

తానూరు: హైదరాబాద్ శ్రీనగర్‌కాలనీలోని శ్రీసత్యసాయి నివాసంలో గురువారం మండల కేంద్రంలోని వాగ్దేవి పాఠశాల విద్యార్థి దోదాడే హర్షవర్ధన్(మూడో తరగతి) సర్ సీవీ.రామన్ అవార్డు అందుకున్నట్లు ప్రధానోపాధ్యాయుడు అరవింద్‌రెడ్డి తెలిపారు. జనవరి 27న తానూరులోని వాగ్దేవి పాఠశాలలో సామాజిక సేవా సంస్థ సూచిరిండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సర్ సీవీ రామన్ టాలెంట్ సెర్చ్ పరీక్ష నిర్వహించగా హర్షవర్ధన్ పాల్గొని జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు, రాష్ట్రస్థాయిలో ఐదో స్థానంలో నిలిచాడు. శాస్త్రవేత్త సతీశ్‌రెడ్డి, నిర్వాహకులు కిరణ్ చేతుల మీదుగా విద్యార్థికి గోల్డ్‌మెడల్ అందించి సన్మానించినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

విద్యార్థుల క్షేత్రపర్యటన



ప్రాజెక్టు వద్ద విద్యార్థులు

ఖానాపూర్: క్షేత్ర పర్యటనలో భాగంగా మండలంలోని మస్కాపూర్ జెడ్పీఎస్ఎస్ విద్యార్థులు నిజామాబాద్‌లోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టును సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థులకు ప్రాజెక్టు గేట్లు, విద్యుత్ ప్లాంట్ పనితీరుపై హెచ్‌ఎం నరేందర్, ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. పీఎంశ్రీ పథకంలో భాగంగా విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు హెచ్‌ఎం పేర్కొన్నారు.

'విద్యారంగంపై నిర్లక్ష్యం'



మాట్లాడుతున్న ఫోరం సభ్యులు

ఖానాపూర్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని సోషల్ డెమోక్రటిక్ ఫోరం కోర్ కమిటీ సభ్యుడు, తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ కె.లక్ష్మీ నారాయణ ఆరోపించారు. మండలంలోని అడవిసారంగాపూర్ పంచాయతీ పరిధిలోని జిల్లెడికుంట గ్రామాన్ని శుక్రవారం సందర్శించారు. ఆదివాసీ గిరిజనుల జీవన స్థితిగతులను తెలుసుకున్నారు. తెలంగాణ విద్యారంగంలో వెనుకబడి ఉందన్నారు. అన్ని రాష్ట్రాల్లో విద్యారంగానికి బడ్జెట్‌లో సగటున 15 శాతం కేటాయిస్తే, తెలంగాణలో 7 శాతం కేటాయించినట్లు గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం సైతం అదే ధోరణి అవలంబిస్తోందని పేర్కొన్నారు. 2014లో విద్యారంగానికి బడ్జెట్‌లో 6 శాతం కేటాయించి.. ప్రస్తుతం 2.6 శాతం చేశారన్నారు. ప్రభుత్వ విద్యను ధ్వంసం చేయాలని పాలకులు చూస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ సభ్యురాలు తమ్మినేని నిర్మల, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వి.మహేందర్, భీంరావు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల నూతన కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గం

లక్ష్మణచాంద: మండలంలో వడ్యాల్ గ్రామంలో శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం మండల రేషన్ డీలర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షులుగా ఒడ్నాల రాజేశ్వర్, మల్లాపూర్ రాజేశ్వర్, అధ్యక్షుడిగా కూన పోశెట్టి, ఉపాధ్యక్షుడిగా లింగన్న, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డిని ఎన్నుకున్నారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

నిర్మల్‌రూరల్: బాబు జగ్జీవన్ రామ్ సేవలు మరువలేనివని.. నేటి యువత వారిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని డీఈఓ రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి స్పాట్ కేంద్రంలో డీఈఓ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఈఓ మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాలకు జగ్జీవన్ రామ్ చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ పద్మ, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు వెంకట రమణారెడ్డి, శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వెంకట రమణా రావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు యాటకారి సాయన్న, భోజన్న, మల్లారెడ్డి పాల్గొన్నారు.

సారంగపూర్: మండలంలోని జామ్ సాంఘీక సంక్షేమశాఖ బాలికల గురుకుల విద్యాలయంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి సిబ్బంది, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ రమాకల్యాణి, సిబ్బంది ఉన్నారు.

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, కమిషనర్ సీవీఎన్ రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఏఈ హరిభువన్, కౌన్సిలర్లు రాజేశ్వర్, నరహరి, నర్సాగౌడ్, నవీన్, పద్మాకర్, నరేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

కుంటాల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బాబుజగ్జీవన్ రామ్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ అడెల్లు, సిబ్బంది వినోద్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఈఓ రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు



నిర్మల్‌లో నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్, కౌన్సిలర్లు

ముథోల్: మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీటీసీ పోతన్నయాదవ్, భోజరాం, భూమన్న, కలిద్‌పాటిల్, అబ్బయ్య, సాయిలు, నరేశ్ పాల్గొన్నారు. ముథోల్‌లోని గురుకుల పాఠశాలలోనూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఖానాపూర్: మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి శుక్రవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్య



ఖానాపూర్‌లో నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు జాన్సన్‌నాయక్

జాన్సన్‌నాయక్ తన క్యాంపు కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజగంగన్న, రామునాయక్, రాజు, ప్రదీప్, రమేశ్, రంజిత్ తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం: మండలంలోని హవర్గాలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ భుజంగ్‌రావు, దశరథ్, భోజన్న, ప్రశాంత్, పోశెట్టి, సాయన్న తదితరులు ఉన్నారు.



ముథోల్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు



కుంటాలలో..



సారంగపూర్: జామ్ గురుకులంలో ..



లోకేశ్వరం: హవర్గలో పూలమాల వేస్తున్న నేతలు

నేడు రైతుదీక్ష

నిర్మల్‌టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక నిర్ణయాలకు నిరసనగా శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట రైతుదీక్ష కార్యక్రమం చేపట్టనున్నట్లు బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఆర్‌ఎస్ అధిష్టానం పిలుపు మేరకు ఉదయం 10 గంటలకు చేపట్టే దీక్షకు బీఆర్‌ఎస్ కార్యకర్తలు, రైతులు హాజరు కావాలని కోరారు.

పరామర్శ

కుంటాల: మండలంలోని కల్లూరులో జి.గంగాధర్ తండ్రి భూమన్న ఇటీవల మృతి చెందారు. శుక్రవారం బాధిత కుటుంబసభ్యులను కేంద్ర మాజీ మంత్రి ఎస్.వేణుగోపాలచారి పరామర్శించారు. మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. వారి వెంట నర్సారెడ్డి, ధర్మగౌడ్ తదితరులు ఉన్నారు.

పోలీస్ బలగాల కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

సారంగపూర్: సమస్యాత్మక ప్రాంతమైన మండలంలోని స్వర్ణ గ్రామంలో సీఆర్పీఎఫ్ బలగాలు, స్థానిక పోలీసులతో కలిసి కవాతు నిర్వహించారు. సీఆర్పీఎఫ్ ఎస్సైలు రాబిన్‌బాబు, విక్రమ్ రాథోడ్, స్థానిక ఎస్సై చంద్రమోహన్ ఆధ్వర్యంలో పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై వసంత్, బలగాలు తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ కిక్కిరిసి..!



స్టేజీ వద్దకు రాక ముందే సీట్ల కోసం ఎగబడుతున్న జనం

- బస్సుల్లో 'మహాలక్ష్మి' గోస
- పెళ్లిళ్లు, శుభకార్యాల సీజన్‌తో విపరీతంగా రద్దీ
- సర్వీసులు పెంచక తప్పని పాట్లు

భైంసాటౌన్: ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కోసం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో మహిళలు పాట్లు పడుతున్నారు. జీరో టికెట్ నేపథ్యంలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళల సంఖ్య బాగా పెరిగింది. దీంతో సామాన్య, పేద తరగతి మహిళలకు ప్రయోజనకరంగా మారింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా సర్వీసులు పెంచకపోవడంతో ఇబ్బంది నెలకొంటోంది. ప్రస్తుతం పెళ్లిళ్లు, శుభకార్యాల సీజన్ కావడంతో ప్రయాణికుల రద్దీ ఉంటోంది. అయితే, సరిపడా సర్వీసులు లేక ప్రజలు కిక్కిరిసి ప్రయాణిస్తున్నారు. సరిపడా సీట్లు దొరకక గంటల తరబడి నిల్చునే వెళ్తున్నారు. పరిమితికి మించి ప్రయాణికులతో అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి చెందుతున్నారు. ప్రయాణికుల రద్దీతో కొన్ని చోట్ల డ్రైవర్లు బస్సు ఆపకుండానే వెళ్తున్న సందర్భాలున్నాయి.

విపరీతంగా రద్దీ...

వేసవి సెలవులతోపాటు పెళ్లిళ్లు, శుభకార్యాల సీజన్ నేపథ్యంలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ నెలకొంది. ఒక్కో బస్సులో వందకు మించి ఓఆర్(ఆక్యుపెన్సీ రేషియో) నమోదవుతోంది. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరిగింది. దీంతో ప్రతి స్టేజీలో పదుల సంఖ్యలో బస్సుల కోసం వేచి చూస్తున్నారు. కొన్నిసార్లు పరిమితికి మించి ప్రయాణికులు ఉండడంతో డ్రైవర్లు కొన్ని స్టేజీల వద్ద బస్సు ఆపకుండానే వెళ్తున్నారు. దీంతో సరిపడా సర్వీసులు లేక గత్యంతరం లేని పరిస్థితుల్లో సీట్లు లేకున్నా బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారు. ఫలితంగా ఆర్టీసీ



సీటు లేక నిల్చొని ప్రయాణిస్తున్న జనం

బస్సుల్లో పరిమితికి మించి ఓఆర్ శాతం నమోదవుతోంది. బస్సు సర్వీసులు పెంచితేనే ఇబ్బందులు తొలిగే అవకాశముందని ప్రయాణికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

సీటు దొరకడం గగనం..

పలు రూట్లు, కొన్ని సమయాల్లో ఆర్టీసీ బస్సుల్లో విపరీతమైన ప్రయాణికుల రద్దీ నెలకొంటోంది. ముఖ్యంగా, మధ్యాహ్నం, ఆఖరి ట్రిప్ వేళ ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. దీంతో బస్సు ప్రారంభ స్టేజి వద్ద ఎక్కిన వారికి మాత్రమే సీటు లభిస్తోంది. రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు అదీ ఉండడం లేదు. ఇక మిగతా స్టేజిల్లో ఎక్కే వారికి నిలబడి ప్రయాణమే దిక్కవుతోంది. చిన్నారులతో ప్రయాణించే మహిళలు, వృద్ధులు సీట్లు దొరకక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గంటల తరబడి నిల్చునే ప్రయాణం చేస్తున్నారు.

అదనపు సర్వీసులకు ప్రతిపాదించాం

పెళ్లిళ్లు, శుభకార్యాల సీజన్ కావడంతో ప్రయాణికుల రద్దీ పెరిగింది. మహాలక్ష్మి పథకం నేపథ్యంలో కూడా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య బాగా పెరిగింది. రద్దీకి అనుగుణంగా అదనపు బస్సుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– ఎం.అమృత, డిపో మేనేజర్, భైంసా

బిందుసేద్యంతో పంటల సాగు

- 50శాతం వరకు నీటి ఆదా
- ఆసక్తి చూపుతున్న రైతులు
- గతంలో మాదిరి రాయితీపై అందించాలని వేడుకోలు

ముథోల్: బిందుసేద్యం ద్వారా తక్కువ నీటితో ఎక్కువ పంటలను పండించవచ్చు. ప్రస్తుతం వేసవి కావడంతో భూగర్భజలాలు అడుగంటి..పంటలకు నీరందడం కష్టమవుతుంది. దీంతో ముథోల్ మండలంలోని కొందరు రైతులు ముందుగానే సాగు వ్యయం తగ్గించుకునేందుకు (డ్రిప్)బిందు సేద్యం పద్ధతిలో పంటలను పండిస్తున్నారు. మండల కేంద్రంతోపాటు తరోడా, విఠోలితండా, విఠోలి, వెంకటాపూర్, చించాల గ్రామాల్లో రైతులు కూరగాయలతో పాటు, నువ్వు, వివిధ పంటలను వేసవిలో సాగు చేస్తున్నారు. ఎండలు పెరుగుతున్నందున బోర్లలో నీరు రావడం కష్టంగా మారింది. రైతులు కష్టపడి 250 నుంచి 350 ఫీట్ల వరకు బోరు బావులు తవ్వించినా.. నీరు కొద్దిగానే రావడంతో రైతులు బిందు సేద్యం పరికరాలనే ఉపయోగిస్తున్నారు.

ఈ విధానంతో నీటి ఆదా..

సాధారణ పద్ధతితో పోలిస్తే బిందుసేద్యంలో పంటలు సాగు చేస్తే 30 నుంచి 50 శాతం వరకు నీటిని ఆదా చేయవచ్చు. కేవలం మొక్క వేరు భాగంలోనే నీరు బొట్టుబొట్టుగా పడుతుంది. దీంతో పంటకాల్వలో నీరు నిల్వ ఉండదు.. దీంతోపాటు కలుపు బాధ ఉండదు. బిందు సేద్యం ద్వారానే మొక్కకు ఎరువులను కూడా అందించవచ్చు. భూగర్భ జలాలు అడుగంటడంతో రైతులు నీటి వృథాను అరికట్టేందుకు డ్రిప్ విధానంలో పంటలు సాగు చేస్తున్నారు.

కానరాని రాయితీ..

గతంలో ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం సబ్సిడీ, బీసీలకు 60శాతం సబ్సిడీపై బిందుసేద్యం పరికరాలు ఇచ్చేవారు. కానీ ప్రభుత్వం గత మూడేళ్లుగా రాయితీని నిలిపివేయడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం గతంలో మాదిరి సబ్సిడీపై బిందుసేద్య పరికరాలను అందిస్తే నీటి వృథాను అరికట్టి లాభాలు పొందుతారు.



బిందుసేద్యంతో సాగు చేస్తున్న కూరగాయల తోట

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

ముథోల్ మండలంలో రెండు వేల ఎకరాల్లో బిందుసేద్యం విధానంలో పంటలు పండిస్తున్నారు. మూడేళ్లుగా ప్రభుత్వం బిందుసేద్య పరికరాలపై రాయితీ ఇవ్వడం లేదు. రైతుల వినతి మేరకు బిందుసేద్యం పరికరాలు ఇవ్వాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.

– హర్షవర్ధన్ రెడ్డి, ఉద్యానశాఖాధికారి, ముథోల్

కొద్దిపాటి నీరే వస్తుంది..



ప్రస్తుతం బిందుసేద్యం విధానంలో కూరగాయలు పండిస్తున్నా. వేసవి కావడంతో బోర్లలోంచి కొద్దిపాటి నీరు మాత్రమే వస్తుంది. ఈ విధానంలో నేరుగా మొక్కలకు నీరు అందిస్తున్నాం. – బోజేందర్, గన్నోరా

రాయితీపై అందించాలి



ప్రభుత్వం మళ్లీ రాయితీపై బిందుసేద్యం పరికరాలను రైతులకు అందిస్తే మేలు జరుగుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు రాయితీపై పరికరాలను అందజేయాలి. – మల్లేశ్, తరోడా

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

కడెం: ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తున్న కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించగా కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణతో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం బీఆర్‌ఎస్‌కు చెందిన సర్పంచ్‌ల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు గొళ్ల వేణుగోపాల్, ఉపసర్పంచ్‌ల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు ముడికే మల్లేశ్ యాదవ్, ఆయా గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ అలెగ్జాండర్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుర్గ భవాని, పట్టణాధ్యక్షుడు వాజీద్‌ఖాన్, సలీం, బబ్లూ తదితరులు ఉన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న బొజ్జు, పక్కన సుగుణ

కాంగ్రెస్‌లో చేరిక..

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు సమక్షంలో శుక్రవారం పలువురు కాంగ్రెస్‌లో చేరారు. సర్సాపూర్(జి) ఎంపీపీ ఇంద్రకరణ్‌రెడ్డి, బీసీ సెల్ ప్రెసిడెంట్ ఉమామహేశ్వర్, వైస్ ఎంపీపీ అజీం ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు హైమద్ అలీ, ఎండీ గౌస్, రాజు, ఇజాజ్, సాజిద్, ఎండీ సమద్, గఫూర్, హర్షద్ అలీ శ్రీహరిరావు క్యాంపు కార్యాలయంలో పార్టీలో చేరారు. వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావును శుక్రవారం మున్నూరు కాపు యువజన మిత్రమండలి కమిటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా శ్రీహరిరావుని శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో పూదరి అరవింద్, గంట రాకేశ్, నాందేడ్ చిన్ను, ఆకుల ప్రవీణ్, నరేందర్, అనిల్, చిరంజీవి, శివ, శ్రీకాంత్, ప్రశాంత్ పాల్గొన్నారు.



శ్రీహరిరావుతో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

షీటీం సేవలపై అవగాహన

సారంగపూర్: మహిళలు, విద్యార్థినులు వేధింపులకు గురైతే ఆందోళన చెందకుండా షీటీం నెంబరు 8712659550, డయల్ 100కు ఫోన్ చేయాలని షీటీం పీసీ రమాదేవి అన్నారు. మండలంలోని జామ్ సాంఘీక సంక్షేమశాఖ బాలికల గురుకులంలో శుక్రవారం షీటీం కార్యకలాపాలు, మహిళల రక్షణ తదితర అంశాలు వివరించారు. అనంతరం విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థినులు చిన్నతనం నుంచే ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలన్నారు. సైబర్ నేరాలు, సోషల్ మీడియా అకౌంట్లు హ్యాకింగ్ చేసి బెదిరిస్తే 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమాకల్యాణి, హోంగార్డు రమాదేవి, సిబ్బంది తదితరులు ఉన్నారు.



విద్యార్థులతో షీటీం సిబ్బంది

వడదెబ్బపై అవగాహన

కుంటాల: మండలంలోని ఓలా తండాలో శుక్రవారం ఇటుక బట్టీల వద్ద కార్మికులకు ఆశవర్కర్లు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించారు. వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. ఆశవర్కర్లు సంతోష, అనురాధ తదితరులు పాల్గొన్నారు.



ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇస్తున్న ఆశవర్కర్లు

లక్ష్మణచాంద: మండలంలోని ధర్మారంలో ప్రజలకు ఆరోగ్య కార్యకర్త శివకృష్ణ వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సి న జాగ్రత్తలను వివరించారు. నీళ్ల , కొబ్బరినీళ్లు, ఓఆర్ఎస్ నీటిని ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. అనారోగ్యం బారిన పడితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రావాలని కోరారు.